క్లుప్తంగా

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కందనూలు: గురు పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఆదివారం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ధరమ్ సింగ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 2న ఉదయం జిల్లా కేంద్రం నుంచి బయలుదేరనున్న బస్సు మార్గం మధ్యలో కాణిపాకం దర్శనం చేపిచ్చుకుని, అరుణాచలం చేరుకుంటుందని, అక్కడ దర్శనం అనంతరం తిరిగి 3వ తేది మధ్యాహ్నం అరుణాచలం నుంచి జిల్లా కేంద్రానికి తిరుగు ప్రయాణం అవుతారని పేర్కొన్నారు.

బస్సు ప్రయాణం సురక్షితం

కోడేరు: ప్రైవేట్ వాహనాలు వద్దు బస్సులో ప్రయాణం సురక్షితమని విలేజ్ బస్సు ఆఫీసర్ మహ్మద్ ఖాజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బస్సులో ప్రయాణంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడంతో సురక్షిత ప్రయాణం ఉంటుందని, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లడంతో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని అన్నారు. ప్రతిఒక్కరూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించి ఆర్టీసీకి లాభం చేకూరేలా చూడాలన్నారు. అదే విధంగా వివాహ శుభకార్యాలు, యాత్రలకు కొల్లాపూర్ డిపో నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని సూచించారు.

చెంచు యువతకు శిక్షణ

అమ్రాబాద్: కోనేరు సంస్థ ఆధ్వర్యంలో పదర మండలం పెట్రాల్‌చేన్ చెంచు పెంటలో యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ, ఉన్నత చదువులతో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని అవి పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి చెందుతామని శిక్షకులు భగత్, ఇస్మాయల్ వివరించారు. ముఖ్యంగా ఇంటర్, డిగ్రీలు చదివిన వారు ఖాళీగా ఉండకుండా నైపుణ్యమైన వృత్తివిద్య కోర్సుల్లో శిక్షణ తీసుకోవాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో శుక్రవారం ఎంపీడీఓ ఆంజనేయులు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం రోడ్డు పక్కన మొక్కలు నాటుతున్న కూలీలతో మాట్లాడారు. నాటిన మొక్కల పక్కన ఉన్న చెత్తాచెదారం తొలగించాలని ఎంపీడీఓ కూలీలకు సూచించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోడేరు: మండల కేంద్రం వద్ద శుక్రవారం హైమాస్ట్ లైట్లను సర్పంచ్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీజీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా దేవరాజ్

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్కపాలోని యస్ యూనివర్సిటీ గ్రాంట్ కమిషనర్ ఆధ్వర్యంలో మానవ వనరుల కమిషన్ నిర్వహిస్తున్న తెలుగు రిఫ్రెషర్ కోర్సుకు వెళ్లనున్నారు. 15 రోజుల పాటు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆయన స్థానంలో జూలై 1 నుంచి 15వ తేదీ వరకు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎంఎస్‌డబ్ల్యూ విభాగానికి చెందిన అధ్యాపకులు దేవరాజ్ బాధ్యతలు నిర్వర్తించాలని పాలమూరు యూనివర్సిటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌ను నూతనంగా ఏర్పాటయ్యే రంగారెడ్డి జిల్లా ఇర్విన్ మండలంలో విలీనం చేయాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెల్దండ మండలానికి దూరంగా ఉండటంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామానికి సక్రమంగా బీటీరోడ్డు లేకపోవడంతో వర్షా కాలంలో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు వివరించారు. లక్ష్మమ్మ, కర్ణాకర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అమ్రాబాద్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అటవీ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న బేస్‌క్యాంపు, ప్రొటెక్షన్ వాచర్లు ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం విలేకరులతో ఫారెస్టు వాచర్ల మండల సభ్యులు విష్ణు, రాజు తదితరులు విలేకరులతో మాట్లాడారు. 22 సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న వాచర్లకు ఇచ్చే వేతనం కూడా తక్కువగా ఉందని, అయినా చాలీచాలని వేతనంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శంగా నిలవాలి

కొల్లాపూర్: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణతో పాటు, వ్యక్తిత్వ విలువల్లో ఇతరులకు ఆదర్శంగా ఉండాలని ఆర్డీఓ హనుమనాయక్ సూచించారు. ఆర్‌అండ్‌బీ శాఖలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న మైనొద్దీన్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. కొంతకాలం ఆయన ఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగులతో పాటు, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఆస్పత్రిలో వైద్యానికి వచ్చిన విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీ రాములు

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో తిరుగుతూ రోగులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడుతున్న సమయంలో ఆస్పత్రికి వచ్చిన విద్యార్థినులతో మాట్లాడారు. బాలింతలకు అన్ని సదుపాయాలు అందుతున్నాయా, కేసీఆర్ కిట్ అందజేస్తున్నారా లేదా వివరాలను ఆరా తీశారు. ఆస్పత్రిలో గైనకాలజీ విభాగంలో రోగులు ఎక్కువగా ఉండటాన్ని చూసి ఇంతమంది ఉన్నారని శివరాంను అడిగారు. రాష్ట్రంలోనే మన ఆస్పత్రి సాధారణ కాన్పుల్లో ప్రథమ స్థానంలో నిలవటంతో, చాలా ఇతర ప్రాంతాల నుంచి గర్భిణులు వస్తున్నారని ఎంపీకి సూపరింటెండెంట్ తెలియజేశారు. అనంతరం సూపరింటెండెంట్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సాయిచంద్‌కు ఘన నివాళి

ప్రముఖ గాయకుడు, తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ పాటతోనే తన జీవితం అన్నట్టుగా జీవనం సాగించాడని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులతో కలిసి నివాళి అర్పించారు. కల్వకుర్తి ప్రాంతంలో తెలంగాణ ఉద్యమ సమయంలో చాలా సార్లు ఉద్యమ గీతాలు పాడి ప్రజలను చైతన్యవంతం చేశారని ఎంపీ గుర్తుచేశారు. అనంతరం కార్యక్రమ ప్రారంభానికి ముందు ఆయన మృతికి సభా వేదికపై ఉన్న వారందరూ మౌనం పాటించి, జోహార్ సాయిచంద్ అని నినాదాలు చేశారు.

పాఠశాల తనిఖీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరులో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను శుక్రవారం ఎంపీ రాములు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదువుకుంటే వృద్ధిలోకి వస్తారని సూచించారు. తమ సొంత గ్రామంలో ఎంపీ అభివృద్ధి పనులను పరిశీలించారు. విద్యుత్ లైన్‌తో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తీర్చాలని ఎంపీ రాములు విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ కిష్టారెడ్డి ఉన్నారు.



ఇసుకను పరిశీలిస్తున్న ఎంపీ రాములు

గ్రూప్-4 పరీక్ష కేంద్రాల పరిశీలన



తెలకపల్లిలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

పెద్దకొత్తపల్లి: గ్రూప్- 4 పరీక్షలు మండలంలో సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పరీక్ష కేంద్రాల్లో 410 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని చీఫ్ సూపరింటెండెంట్ మద్దిలేటికి సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. కేంద్రాల వద్దకు విద్యార్థులు ముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్షల సందర్భంగా మాల్ ప్రాక్టీసు జరుగకుండా చూడాలని అన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ పుష్పలత పేర్కొన్నారు. శుక్రవారం పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. గ్రూప్-4 పరీక్షకు సమయానికి కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

తెలకపల్లి: గ్రూప్-4 పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ కృష్ణయ్య శుక్రవారం తెలకపల్లిలో పరిశీలించారు. మండల కేంద్రంలో 4 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాజమహేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సందీప్ ఉన్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు

కొల్లాపూర్: గ్రూప్-4 పరీక్షలకు వెళ్లే వారికోసం కొల్లాపూర్ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం రాజేశ్వర్ వెల్లడించారు. శనివారం తెల్లవారుఝాము నుంచి హైదరాబాద్, నాగర్‌కర్నూల్, వనపర్తి, అచ్చంపేట ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను పంపుతామన్నారు. సాయంత్రం తిరుగు ప్రయాణాలకు వీలుగా కూడా బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు.

పబ్బతి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఉత్సవ మూర్తిని తీసుకెళ్తున్న భక్తులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలోని పబ్బతి ఆంజనేయస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశి ముగింపు సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద చక్రతీర్థ స్నానం, అర్చనా అభిషేకం చేశారు. అనంతరం ఉపవాసం ఉన్నవారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు మట్ట కలమ్మ, అంచోజు రాజేశ్ చారి, కృష్ణ గౌడ్, కొండగిరి, ఆలయ అర్చకులు దత్తాత్రేయ శర్మ, శ్రీనివాసులు శర్మ, ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే గువ్వల జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యకర్తలు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలను శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రధాన రహదారి వెంట భారీ బైక్, వాహనాల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో గజమాలతో కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మెల్యే సతీమణి గువ్వల అమల, కుమారులు శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కుమారులు చేతి వాచ్‌ను గిఫ్ట్‌గా అందించారు.

మన్ననూర్/ అమ్రాబాద్/ లింగాల: మండల కేంద్రంలో, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

నోట్‌పుస్తకాలు, పెన్నులు వితరణ.

దోమలపెంట: ప్రభుత్వ విప్, జన్మదినం పురస్కరించుకుని దోమలపెంటలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ మహేష్ తదితరులు అందజేశారు.

కనకాల మైసమ్మ వద్ద..

బల్మూర్: ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సతీమణి అమలతో కలిసి కనకాల మైసమ్మ ఆలయాన్ని శుక్రవారం సదర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మైసమ్మ ఆలయం వద్ద దంపతులతో కేక్ కట్ చేయించారు.

పట్టాలిచ్చేంత వరకు పోరాటం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో రెండు రోజులుగా ఇళ్ల స్థలాల కోసం పెంట్లవెల్లి గ్రామ ప్రజలు వందలాది మంది పెంట్లవెల్లిలో 22, 27 సర్వే నంబర్‌లోని 14 ఎకరాల భూమిని కబ్జా చేసుకుని శుక్రవారం హద్దులు ఏర్పాటు చేసుకుని ఏకంగా గుడిసెలు వేసుకున్నారు. ప్రజలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మద్దతు తెలియజేశారు. ఆయన మద్దతుతో ప్రజలు ఆ భూమిలో చీరలతో గుడిసెలు వేశారు. అందులో భాగంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు ఆ స్థలాన్ని పరిశీలించి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎవరైతే కబ్జాలో ఉన్నారో వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు మీకు అండగా ఉంటామని, ఎంత వరకైనా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. పేదలకు ఇంటి జాగ ఇచ్చేవరకు అందరం ఐక్యంగా ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు స్పందించి వెంటనే పేదలకు స్థలాలు కేటాయించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

రాత్రిపూట ప్రజలు అక్కడే నిద్ర..

మాకు ఇళ్ల స్థలాలు కేటాయించేంత వరకు మేము కబ్జాలో ఉన్న స్థలంలోనే ఇక్కడే తిని, ఇక్కడే ఉంటామని గురువారం రాత్రి ప్రజలు హద్దులు పెట్టుకుని అక్కడే తిని నిద్రపోయారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పేదలకు ఇస్తామన్న స్థలాలు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, ఈశ్వర్, నర్సింహ, శివవర్మ, హనుమంతు, దశరథం, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది ముందస్తు అరెస్టు

ఉప్పునుంతల: లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం చలో ప్రగతి ముట్టడి కార్యక్రమాన్ని వెళ్లడానికి ప్రయత్నిస్తున్న మండలంలోని తొమ్మిది మందిని ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడిచిపెట్టినట్లు తెలిపారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో దేవదారికుంట తండాకు చెందిన మూడావత్ వసంత్‌తో పాటు మరో ఎనిమిది మంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఊర్కొండ: మండలంలోని మాదారంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో తనతో పాటు చదువుకున్న తన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. గత నెలలో మాదారానికి చెందిన జనార్దన్(30) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి భార్య, తమ్ముడు ఉన్నాడు. ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో జనార్దన్ క్లాస్‌మెట్స్ తమకు తోచినంత సేకరించి రూ.89,000 జమ చేసి కుటుంబానికి అందజేశారు. ఇస్మాయిల్, శేఖర్, సాగర్, పాల్గొన్నారు.

పీఆర్‌సీని అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలోని 12,751 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే పీఆర్‌సీని అమలు చేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. 9 మాసాల కిందట రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులకు పీఆర్‌సీని వర్తింపజేసిన సీఎం గ్రామపంచాయతీ కార్మికులకు మాత్రం పీఆర్‌సీ అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, బాలస్వామి, శ్రీకాంత్, రాము, కాశీం, తిరుపతయ్య పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

నాగర్‌కర్నూల్ క్రైం: రక్తదానంతో ఆపద సమయంలో ఎన్నో ప్రాణాలు నిలుస్తాయని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ భీమ్‌సేన్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏపీజీవీబీ రీజినల్ ఆఫీసర్ ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 34 యూనిట్లు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని సూచించారు. దయాకర్, రవికాంత్, సుబాష్, కౌశల్‌కుమార్ పాండే పాల్గొన్నారు.

కల్వకుర్తిలో వైద్యశిబిరం

కల్వకుర్తి రూరల్: ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని ముకురాలలో వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ వెంకటేష్ తనయుడు డాక్టర్ అఖిల్ కామినేని ఆస్పత్రి వైద్యుల సహకారంతో శిబిరం నిర్వహించారు. 300 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ నరేందర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గణేష్, సురేష్ పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ

అచ్చంపేట రూరల్: పేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమని పట్టణంలోని సాయినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం జె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రిటైర్డ్ జీహెచ్‌ఎం నాగవెల్లి సైదులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. పేద విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తానని అన్నారు. అలాగే మండలంలోని ఎంపీహెచ్‌ఎస్ బొమ్మన్‌పల్లి స్కూల్‌లో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

వ్యక్తికి గాయాలు

బల్మూర్: మండలంలోని మహదేవ్‌పూర్‌కు చెందిన మల్లయ్య గట్టుతుమ్మెన్‌లోని తన కుమార్తెను బైక్‌పై ఎక్కించుకుని వెళ్తుండగా... ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో మల్లయ్య తలకు తీవ్ర గాయం కావడంతో అతడిని అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శక్తి కేంద్రాల బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు మేరా బూత్, సబ్ మజ్‌బూత్ కార్యక్రమాన్ని కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధి కోసమేనని చెప్పారు. పట్టణ అధ్యక్షుడు నర్సింహ, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, హరిప్రసాద్, దుర్గాప్రసాద్ రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వెల్దండ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేయాలని జాతీయ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చొక్కన్నపల్లిలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలన్నారు. నర్సింహ, విజేందర్‌రెడ్డి, శ్రీనివాసచారి, దుర్గయ్య పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

లింగాల: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ విస్తారక్ మనోజ్ అన్నారు. బీజేపీ చేపట్టిన 'మేరా బూత్ సబ్సే మజ్బూత్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్ణాటక నుంచి పరిశీలకుడిగా మండలానికి వచ్చిన విస్తారక్ మనోజ్ బీజేపీ శ్రేణులను దిశ నిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో వివిధ బూత్‌లను, శక్తి కేంద్రాలను పరిశీలించారు. సలేశ్వరం, శ్రీనివాసులు, హరితేజగౌడ్, విష్ణు పాల్గొన్నారు.

తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం

తాడూరు: తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండ మణెమ్మ అన్నారు. శుక్రవారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాన మంత్రి మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలను మండలంలోని ఇంద్రకల్‌లో ఇంటింటికీ వివరించారు. కొండనాగేష్, లోహిత్‌రెడ్డి, ఆంజనేయులు, సందీప్‌రెడ్డి, అంజి, స్వామి పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల



కొల్లాపూర్: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్లను శుక్రవారం కొల్లాపూర్‌లో ముస్లిం నాయకులు విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణలోని యువతను మేల్కొల్పేందుకు ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలి

కల్వకుర్తి: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ప్రముఖ వైద్యుడు దామోదర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో తన మనుమరాలు లాస్య జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, జామెట్రీ బాక్సులు అందజేశారు. 10-10 జీపీఏ సాధించిన విద్యార్థి తేజాచారిని శాలువాతో సత్కరించి రూ.2 వేల నగదు అందజేశారు. డాక్టర్ దామోదర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలి



వెల్దండలో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలో మళ్లీ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని ఎన్‌ఆర్‌ఐ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి మొదటి సారిగా కల్వకుర్తి నియోజకవర్గానికి రావడంతో శుక్రవారం వెల్దండలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో చేరుకుని ఘనంగా స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

చారకొండ: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేటలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలో పనిచేసిన వారిని గుర్తిస్తామని అన్నారు. చారకొండ మండలానికి సంబంధించిన మండల కమిటీలో కొంత మందికి నూతనంగా అవకాశం కల్పించారు. చారకొండ మండల వర్కింగ్ ప్రసిడెంట్‌గా అనిశెట్టి నాగేంద్ర, యూత్ ప్రసిడెంట్‌గా గణేష్, ప్రధాన కార్యదర్శిగా కేశమోని శంకర్‌ను, విద్యార్థి సంఘం ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా గోరటి శివ నూతనంగా ఎన్నికవగా.. వారికి నియామక పత్రాలు అందజేశారు. మహేందర్, వెంకట్ గౌడ్, అంజయ్య ఉన్నారు.

కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు

తాడూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముమ్మరంగా గ్రామ కమిటీల ఏర్పాటును ప్రారంభించారు. శుక్రవారం మండలంలోని ఆకునెల్లికుదురు, పొల్మూరు, మేడిపూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రతి గ్రామంలో బలోపేతం చేసేందుకు కమిటీల ఏర్పాటు చేస్తున్నట్లు పీసీసీ సభ్యుడు బాలగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐతోల్ లక్ష్మయ్య తెలియజేశారు.

బీటీ రోడ్డు నాణ్యతగా చేపట్టాలి

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్ నుంచి హైదరాబాద్ రోడ్డు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను శుక్రవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సర్పంచ్ అంజినాయక్, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కంటోనిపల్లిలోని ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించడం లేదన్నారు. అనంతరం పాఠశాలల్లో సర్పంచ్ పెద్ది రామకృష్ణతో సమావేశం నిర్వహించారు. సురేందర్, అంజయ్య, పాఠశాల హెచ్‌ఎం పరమేష్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సేవ చేసేవారికే గుర్తింపు

తాడూరు: ప్రభుత్వ ఉద్యోగులు వారి స్థాయిని బట్టి బాధ్యతతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి టి.కృష్ణ అన్నారు. కార్యాలయ సబార్డినేట్‌గా 30 ఏళ్ల పాటు విధులు నిర్వహించి సేవకే అంకితమైన సుల్తాన్ పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగంలో ఉన్నంత వరకు మనం చేసిన సేవలను సమాజం గుర్తిస్తుందన్నారు. ఎంపీపీ శివలీల, శేకర్‌గౌడ్, ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్, ఏఈ ఉపేందర్‌రెడ్డి, ఎంపీడీఓ గంగామోహన్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లికి చెందిన శంకరయ్యకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.70 వేల చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు గణేష్‌రావు అందజేశారు. లింగస్వామి, విష్ణు, మల్లేష్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో అన్నదానం

కల్వకుర్తి రూరల్: అన్నదానం మహాదానమని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు యువకుడి అప్పగింత



బోయ రవీందర్‌తో కానిస్టేబుల్ రాందాసు

అచ్చంపేట రూరల్: మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడిని అచ్చంపేట కానిస్టేబుల్ రాందాసు చాకచక్యంగా పట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా పోతన్‌పల్లికి చెందిన బోయ రవీందర్ వ్యవసాయ పొలం వద్ద ఇరుగు పొరుగు రైతులతో వాగ్వాదం చోటు చేసుకుంది. కొన్ని రోజులుగా భూ సమస్య ఉండటం రెండు రోజుల కిందట ఘర్షణ జరగడంతో మనస్తాపం చెంది బైక్‌పై వెళ్లిపోయాడు. సామాజిక మాధ్యమాల ద్వారా బోయ రవీందర్ ఫొటోను వ్యక్తి కనిపించడం లేదని పోస్టులు చేశారు. ఇది గమనించిన అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రాందాసు మొబైల్ నంబర్ ఆధారంగా అచ్చంపేట మండలం బొల్లగట్‌పల్లి శివారు ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అక్కడి వెళ్లాడు. అప్పటికే బోయ రవీందర్ తన వెంట క్రిమిసంహారక మందు డబ్బా, వాటర్ బాటిల్‌ను తెచ్చుకున్నాడు. మాట కలిపి రవీందర్‌ను పట్టుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించాడు. కానిస్టేబుల్‌ను అచ్చంపేట డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ అనుదీప్, ఎస్‌ఐ గోవర్ధన్ అభినందించారు.